

ఫిజియోథెరపీ వైపు ప్రజల చూపు

ఫిజియోథెరపీ ద్వారా వైద్యం అందిస్తే శారీరక సంవృద్ధి,శక్తి పొందొచ్చు. జీవనశైలి సజావుగా సాగడానికి ఉపయోగపడుతుంది. -8లో..



రైల్వే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కడప రైల్వే స్టేషన్‌లో ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ అన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 405 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

గండిలోకి వాహనాలకు అనుమతి లేదు

చక్రాయపేట: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా గండిలోకి ఎలాంటి వాహనాలను అనుమతించే ప్రసక్తే లేదని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి పేర్కొన్నారు. వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన తెలిపారు. ద్విచక్రాల వాహనాలను సైతం అనుమతించేది లేదన్నారు. ఈవిషయంలో ప్రతి వ్యక్తి పోలీసులకు సహకరించాలని చెప్పారు.రాయచోటి వైపునుంచి వచ్చే వాహనాలు అద్దాలమర్రి క్రాస్ వద్ద, వేంపల్లె వైపు నుంచి వచ్చే వాహనాలను ఇడుపులపాయ క్రాస్ వద్దే ఆపేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ ఎస్సై రంగారావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు



దర్గా మాతాజీ మూలవిరాట్

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ పరిధిలోని శ్రీ సద్గురు సాయి నగర్‌లో వెలసిన శ్రీ సద్గురు దర్గా మాతాజీ 19వ నవదశ ఆరాధనోత్సవాలు శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నట్లు భక్తులు పేర్కొన్నారు. ఉత్సవాలకు మండలంలోని నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. 8వ తేదీ శుక్రవారం ఉదయం సమర్థ సద్గురు దర్గా మాతాజీ సమాధి మందిరం వద్ద ప్రార్థనలు, గురుపూజ , నవగ్రహ పూజ, రక్ష బంధన, కలశం, రుద్రాభిషేకం జరుగుతాయి. సాయంత్రం శ్రీ లలిత సహస్రనామ పూజ నిర్వహిస్తారు. 9న శనివారం దర్గా మాతాజీ సమాధి మందిరం వద్ద ప్రార్థన అనంతరం గురుపూజ, మాతాజీ విగ్రహానికి అభిషేకాలు, చండీ హోమం జరుగుతుందని భక్తులు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కేవీపల్లె: రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ అన్నారు. గురువారం కేవీపల్లెలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు వందశాతం నమోదు చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం కేవీపల్లెలోని ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.5 లక్షల విరాళం

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రు.1,50,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన బీకేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి రు.1,00,116, తమిళనాడు రాష్ట్రం ఈరోడ్ పట్టణానికి చెందిన హంచాటి లక్ష్మణరావు రు.50 వేలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలచే స్వామికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసినట్లు చెప్పారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

చిన్నమండెం: మండల పరిధిలోని బోనమల గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ధనలక్ష్మీ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బోనమల సచివాలయం, నగురువాండ్లపల్లెలోని అంగన్వాడీ కేంద్రం, కనకంటివారిపల్లె డంపింగ్‌యార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్ర సిబ్బందితో మాట్లాడుతూ మెనూ ప్రకారం వంట చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సమయపాలన పాటించాలని చెప్పారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. సర్పంచ్ అఫ్రోజ్, పంచాయతీ సెక్రటరీ కొండయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదును దాటినా.. పదును లేదాయే

అన్నదాతను దెబ్బతీసిన ఖరీఫ్

- తీవ్ర వర్షాభావంతో ఎండుతున్న వేరుశనగ
- సాధారణ సాగు 82,589 హెక్టార్లు.. సాగైంది 25,210 హెక్టార్లే
- ఆగస్టులో 70.4 మిమీ లోటు వర్షపాతం
- ఇప్పటి వానలతో ఉలవల సాగుకు ప్రయోజనం



తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎండిపోతున్న వేరుశెనగ పంట

బి.కొత్తకోట: జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు దశాబ్దకాలం తర్వాత ఇదే ప్రథమం .ప్రస్తుత ఖరీఫ్ రైతాంగాన్ని దెబ్బతీసింది. పంటలను సాగుచేసేందుకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడిని సిద్ధం చేసుకున్న రైతులకు జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షాభావ పరిస్థితులు నిరాశ కలిగించాయి. సాగు కోసం సిద్ధం చేసిన పోలాలు బీళ్లుగా మిగిలిపోయాయి. సగటు వర్షపాతం నమోదు కాకపోగా లోటు నమోదైంది. ఫలితంగా గడువు ముగిసినా పంటలు అరకొర సాగుకావడం నిరాశ కలిగించింది.

సాగు 30 శాతమే

జిల్లాలో వేరుశనగ సహా అన్ని పంటలు కలుపుకుని 82,589 హెక్టార్లలో ఖరీఫ్ సాధారణ పంటలు సాగు కావాలని వ్యవసాయశాఖ అంచనా. దీనికి తగ్గట్టుగా ప్రణాళికను అమలు చేశారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేసింది. మే చివర నుంచి పంటల సాగు మొదలైంది. జూన్‌లో అత్యధికంగా పంటల సాగు జరగాలి. వర్షాలు లేక సాగు ముందుకు సాగలేదు. జూలై నెల వేరుశనగ సాగుకు కీలకం..అయితే ఈనెలలోనూ వర్షం కురవలేదు. చివరగా ఆగస్టునెలలో వర్షాలు కురిస్తే సాధ్యమైనంత మేర పంటలు సాగవుతాయి. ఆగస్టులో వర్షాభావ పరిస్థతులు నెలకొన్నాయి. ఫలితంగా జిల్లాలో సాధారణ సాగులో 25,210 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. అంటే కేవలం 30.52 శాతం విస్తర్ణంలోనే పంటలు సాగయ్యాయి. ప్రధానంగా 47,885 హెక్టార్లలో సాగవ్వాల్సిన వేరుశనగ పంట కేవలం 13,344 హెక్టార్లకే పరిమితమైంది. వేరుశనగ పంటలపై ఆశలు పెట్టుకున్న రైతాంగానికి తీవ్ర నిరాశే మిగిలింది. సాగుచేసిన పంటలు కూడా వర్షంలేక ఎండిపోతున్నాయి. కాపాడుకునే పరిస్థితులు లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అత్యల్ప సాగు మండలాలు

జిల్లాలోని పలు మండలాల్లో ఖరీఫ్‌సాగు అత్యల్పంగా నమోదైంది. రైల్వేకోడూరు మండలంలో 24 హెక్టార్లలో, చిట్వేలిలో 46, పుల్లంపేటలో 55, పెనగలూరులో 180, రామాపురంలో 183, రాయచోటిలో 211, చిన్నమండెంలో 221, వీరబల్లిలో 247 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. 300 లోపు హెక్టార్లలో సాగైన మండలాలు కూడా ఉన్నాయి.

వేరుశనగకు ప్రాణం పోసిన వర్షం

జిల్లాలో ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలు వేరుశనగ పంటకు ప్రాణం పోశాయి. నీరులేకపోయినా తట్టుకునే మొక్క కావడంతో ఎండిపోయినా మళ్లీ జీవం పోసుకున్నాయి. ఖరీఫ్ పంటలు సాగుచేయని రైతులు ప్రత్యామ్నాయంగా ఉలవను సాగుచేసేందుకు ఈ వర్షాలు ఉపయోగపడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని ఆర్బీకేలకు ఉలవల సరఫరా సాగుతోందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కాగా వర్షాలు కురవని మండలాల్లో వేరుశనగ పంటను కాపాడుకునేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచనలు ఇస్తున్నారు. ఒక లీటరు నీటిలో 20 గ్రాముల యూరియాను కలిపి ద్రావణంగా చేసి పంటకు పిచికారి చేయాలి. ఇలా చేయడం ద్వారా పంటను పదిరోజుల పాటు కాపాడుకోవచ్చు. ఈలోగా వర్షాలు కురిస్తే పంటకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

వర్షపాత వివరాలు (మి.మీలలో)

నెల	కురవాల్సింది	కురిసింది	లోటు
జూన్	75.1	39.4	47.5
జూలై	90.5	63.4	29.9
ఆగస్టు	99.8	29.5	70.4

డివిజన్ల వారీగా సాగు వివరాలు (హెక్టార్లలో)

సబ్‌డివిజన్	సాగులక్ష్యం	సాగైంది
రాయచోటి	8,129	1,863
లక్కిరెడ్డిపల్లె	10,221	2,080
రాజంపేట	1,228	784
రైల్వేకోడూరు	794	214
మదనపల్లె	39,631	14,037
పీలేరు	8,255	2,990
వాయల్పాడు	14,332	3,234

తగ్గిన సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

పంట	సాగు కావాల్సింది	సాగైంది
వేరుశనగ	47,885	13,344
టమాట	8,110	3,399
వరి	9,748	3,799
సజ్జలు	633	170
మొక్కజొన్న	1,657	1,465
కందులు	3,671	464

పెట్టుబడి నష్టపోయాం



సకాలంలో వర్షాలు పడక వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. రెండు ఎకరాల్లో సాగు చేశా. ఎకరాకు రూ.32 వేలు దాకా ఖర్చయింది.ఊడలు పిందెలు దిగే సమయంలో వాన పడలేదు. ఖరీఫ్ పంట కోసం పెట్టిన పెట్టుబడులు పూర్తిగా పోయాయి. పశువుల మేతగానైనా పనికి వస్తుందని పంటను తొలగిస్తున్నా. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

–బి.మధుసూధన్ రెడ్డి, పిచ్చలవాండ్లపల్లె, కురబలకోట మండలం

15 నుంచి ఉలవల సాగు



జిల్లాలో సెప్టెంబర్ 15 నుంచి ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఉలవల సాగు మొదలవుతుంది. జిల్లాకు 11,900 క్వింటాళ్ల ఉలవలు కావాలని ప్రతిపాదించగా ప్రభుత్వం తొలి విడతలో 6 వేల క్వింటాళ్లు సరఫరా చేసింది. వీటిని రైతుభరోసా కేంద్రాలకు తరలించాం. 80శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేస్తున్నాం. వేరుశగ పంటను కాపాడుకునేందుకు యూరియా ద్రావణం పిచికారీ చేయాలి.

–బి.చంద్రానాయక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు ఉపయోగించుకోవాలి

- డీఎంహెచ్‌ఓ కొండయ్య



రాయచోటి అర్బన్: డాక్టర్ వైఎస్‌ఆర్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ఉపయోగించుకోవాలని అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కాన్పు అనంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో తల్లీబిడ్డను తీసుకెళ్లేవారన్నారు. ఈ సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు.ప్రమాదకర లక్షణాలు గల గర్భిణుల్లో ఎవరికైతే ప్రస్తుత నెలలో కాన్పు అంచనా తేదీ ఉంటుందో అలాంటి వారు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ఉపయోగించుకునేందుకు అర్హులన్నారు. హైరిస్క్ గర్భిణులను వారి కాన్పు అంచనా తేదీకి 3,4 రోజుల ముందు ఆసుపత్రికి తీసుకెళ్లడం, ప్రసవం అనంతరం ఇంటికి చేర్చడం కూడా జరుగుతుందన్నారు.అన్నమయ్య జిల్లాకు 14 వైఎస్‌ఆర్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ, వార్డు వలంటీర్లు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులకు సేవలు అందేవిధంగా చూడాలని చెప్పారు.

ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీ

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు ఎనిమిదో తరగతి పాసై ఉండాలన్నారు. 40 ఏళ్ల గరిష్ఠ వయసున్న వారు ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, తీసుకుని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా ఉచితంగా దరఖాస్తులు పంపవచ్చునన్నారు. ఈ నెల 19 వరకు దరఖాస్తుల స్వీకరణ, 20న పరిశీలన ఉంటుందన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఓటరు జాబితా సవరణపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఈఆర్‌ఓలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తప్పులు లేని, స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సంబంధిత అధికారులందరూ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గాల వారీగా జంక్ క్యారెక్టర్, సున్నా డోర్ నంబర్ ఓట్లు, డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారి ఓట్లు, ఫేక్ ఓటర్లపై ఎన్నికల కమిషన్ నియమ నిబంధన ప్రకారం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫామ్-7, ఫామ్-8 పెండింగ్ లేకుండా వెంటనే పరిశీలించాలన్నారు. పోలింగ్ బూత్ వారీగా బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మరో పోలింగ్ స్టేషన్ పరిధిలోకి మారి ఉంటే ఆ వివరాలను కూడా నిర్దేశిత ఫారంలో పక్కాగా నమోదు చేయాలన్నారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని డోర్ నంబర్ల వారీగా మరోసారి తనిఖీ చేయాలన్నారు.అన్నమయ్య జిల్లాలో అన్ని పార్టీ ప్రతినిధుల సహకారంతో తప్పులు లేని ఓటర్ జాబితా తయారు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిలో లక్ష్యాలను సాధించాలి

సుస్థిర అభివృద్ధిలో వందశాతం లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వివిధశాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రామవార్డు సచివాలయం సేవలు, ఐసీడీఎస్ పథకాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 10-19 మధ్య వయసున్న అడలసెంట్ బాలికలలో రక్తహీనతను నివారించడానికి అధికారులు బాధ్యతగా కృషి చేయాలన్నారు. పంచాయితీలు, పట్టణ ప్రాంతాలలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

వైభవంగా మహాపూర్ణాహుతి



పవిత్రాలతో సిద్ధేశ్వరస్వామి

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలోని కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాపూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో జరిగిన పవిత్రోత్సవాల్లో డిప్యూటీ ఈవో నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గురుస్వామియాదవ్, తాళ్లపాక సర్పంచ్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. వేదపండితులు విష్ణుకుమార్, మల్లాది సత్యనారాయణ, విశ్వనాథ్, వసంత గురుకల్, స్థానిక అర్చకస్వామి భక్తవత్సలం కలిసి శైవాగమశాస్త్రం ప్రకారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. చివరిగా కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి వార్లకు పవిత్రాలను సమర్పించారు.

రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

పీలేరు : రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో ఏపీమాస్ స్వచ్ఛంధ సేవా సంస్థ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన మహిళలు, పురుషులు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాణించడానికి నూతన పరిశ్రమల స్థాపనకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్‌కు సమాజంలో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. తమ వ్యాపార అభివృద్ధికి అయ్యే ఖర్చులో పది శాతం మాత్రమే లబ్ధిదారులు పెట్టుబడి పెడితే, ప్రభుత్వం 35 శాతం సబ్సిడీగా, 55 శాతం బ్యాంకు రుణం పొందవచ్చని తెలిపారు. బియ్యం పిండి, రైస్ బ్రాన్ ఆయిల్, నూడిల్స్, అప్పడాల తయారీ తదితర ఆహార ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదేషావలి, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఏపీ మాస్ డైరెక్టర్ వినాయక రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ భార్గవి, వాసు, రమేష్, ఖాదర్‌బాషా, సందీప్‌రెడ్డి, హెచ్‌ఈవో దరహాస్ తదితరులు పాల్గొన్నారు.

సీతాకోకచిలుక.. కనులవిందు ఇక



వైవీయూలోని బటర్‌ఫ్లై పార్కు



వైవీయూలోని వివిధ వర్ణాల సీతాకోకచిలుకలు

‘సీతాకోక చిలుకమ్మ.. లేలేత చిగురాకులమ్మ.. పారాడు పాపాయిలమ్మ.. పారేటి సెలయేరులమ్మ..’ అంటూ సీతాకోక చిలుక అందం ఓ సినీ కవి వర్ణించారు. ప్రకృతిలోని అందాన్ని తన ఒంటిపై వేసుకుని అందరి కళ్లకు కనువిందుచేసే అరుదైన పర్యావరణ హితులు సీతాకోక చిలుకలు.. అలాంటి వాటిని చూసేందుకు యోగి వేమన విశ్వవిద్యాలయం వేదికగా మారింది.

- వైవీయూలో మళ్లీ ప్రారంభమైన సీతాకోక చిలుకల పార్కు

వైవీయూ: జీవ వైవిధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది యోగి వేమన విశ్వవిద్యాలయం. ఈ విశ్వవిద్యాలయంలో ఇప్పటికే 20 ఎకరాల్లో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ అరుదైన, అంతరించిపోయే వృక్ష జాతులను సంరక్షిస్తుండగా, తాజాగా సీతాకోక చిలుకల పార్కును ఏర్పాటు చేయడం విశేషం. విశ్వవిద్యాలయ జంతుశాస్త్ర శాఖ అధ్యాపకుడు డాక్టర్ ఎస్.పి.వెంకటరమణ ఆధ్వర్యంలో 2010లోనే పార్కు ఏర్పాటు చేసినా కొంతకాలం తర్వాత వాటి నిర్వహణను నిలిపివేశారు. అయితే ప్రస్తుత వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యల ప్రోత్సాహంతో మళ్లీ ఈ పార్కు పునఃప్రారంభమైంది.

ప్రకృతి పరిరక్షణే ధ్యేయంగా

‘సేవ్ నేచర్ అండ్ సేవ్ బటర్‌ఫ్లై నినాదంతో ల్యాబొరేటరీల్లో వాటిని వృద్ధి చేసి పంట పొలాల్లో విడుదల చేయడం ద్వారా ఫలదీకరణ ప్రక్రియ ఎక్కువగా జరుగుతుందని ఆచార్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా 2006లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈ ప్రక్రియను ప్రారంభించగా, 2010లో వైవీయూలో మోడల్ బటర్‌ఫ్లై పార్కు ప్రారంభించారు.

- సీతాకోక చిలుకలు విశేషంగా కనిపించే ప్రాంతం తూర్పు కనుమలు. దాదాపు 151 విభిన్నమైన సీతాకోక చిలుకలను ఇక్కడ గుర్తించారు. ఉత్తరాంధ్రలో 60కి పైగా, శేషాచలం, లంకమల అరణ్యాలలో 46 రకాల జాతులు గుర్తించారు. 1994-2023 మధ్య చిలుకల సంఖ్య తగ్గింది. పచ్చిక ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు తగ్గిపోవడంతో మనుగడకు ముప్పు ఏర్పడింది. పార్కు ఏర్పాటుచేసి సంరక్షిస్తున్నారు.

పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తాయి

సీతాకోక చిలుకలు గ్రుడ్డుదశ, లార్వాదశ, గొంగళిపురుగు దశ, ప్యూపాదశ, తర్వాత రంగరంగుల రెక్కల సీతాకోక చిలుక దశ ఉంటుంది. రెండు వారాలలోపు వీటి జీవితకాలం పూర్తవుతుంది. ఇవి పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తాయి. యోగివేమన విశ్వవిద్యాలయంలో వాటిపై పరిశోధనలు చేస్తున్నాం. నలుగురు పరిశోధనలు పూర్తిచేసి డాక్టరేట్ పొందారు.

– డాక్టర్ ఎస్.పి.వెంకటరమణ, వైవీయూ జంతుశాస్త్ర విభాగం సహ ఆచార్యులు

భవిత బలోపేతం

- భవిత కేంద్రాల్లో ఖాళీల భర్తీకి చర్యలు
- దరఖాస్తులకు 18 వరకు గడువు
- దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మదనపల్లెలోని భవిత కేంద్రం

మదనపల్లె సిటీ: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఇందులో భాగంగా దివ్యాంగుల కోసం విద్యను అందించే భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న రిసోర్సుపర్సన్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్త చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 396 పోస్టులు భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అన్నమయ్య జిల్లాలో 22 పోస్టులు భర్తీ కానున్నాయి. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఖాళీలున్న చోట్ల ఆయా జిల్లా సమగ్ర శిక్ష అధికారులు భర్తీకి చర్యలు చేపట్టారు .జిల్లాలో 30 భవిత కేంద్రాలు ఉండగా, ఇందులో 545 మంది పిల్లలు చదువుతున్నారు. ఒక కేంద్రానికి ఇద్దరు రిసోర్సుపర్సన్లు ఉండేలా చర్యలు తీసుకుంటారు.

ప్రారంభమైన ఆన్‌లైన్

జిల్లా సహిత విద్య రిసోర్సుపర్సన్లు పోస్టుల కోసం ఈనెల 4 నుంచి ఆన్‌లైన్ ప్రారంభమైంది. htpp.apie.apcfss.in వైబ్ సైట్ ద్వారా ఈనెల 18 వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. మానసిక వైకల్యం (ఎంఆర్), వినికిడి, చెవిటి (వీఐ, హెచ్‌ఐ) విభాగాలకు చెందిన పోస్టులు మంజూరయ్యాయి.

నిబంధనలు ఇవీ..

- సంబంధిత విభాగాల్లో ప్రత్యేక బీఈడీ చేసి ఉండాలి.
- అభ్యర్థుల వయస్సు 18-42 సంవత్సరాలలోపు ఉండాలి.
- ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కి మూడేళ్లు, దివ్యాంగులకి 10 ఏళ్ల వయో పరిమితి సడలింపు ఉంటుంది.

జిల్లాలో భవిత కేంద్రాల్లో రిసోర్సుపర్సన్ల ఖాళీలు..

మండలం	పోస్టులు
రామసముద్రం	01
బి.కొత్తకోట	02
పీటీఎం	02
ములకలచెరువు	02
తంబళ్లపల్లె	02
కలకడ	01
కె.వి.పల్లి	01
పెద్దమండ్యం	01
ఓబులవారిపల్లె	02
పుల్లంపేట	01
చిట్వేలి	01
నందలూరు	01
రామాపురం	01
లక్కిరెడ్డిపల్లె	01
పెనగలూరు	01
సంబేపల్లి	01
గాలివీడు	01

ప్రతిభ ఆధారంగా ఎంపిక



అర్హులైన అభ్యర్థులకు ఇది చక్కని అవకాశం. ప్రభుత్వ నియమ,నిబంధనల పాటిస్తూ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేపడుతాం. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–జనార్దన్, సహితవిద్య జిల్లా సమన్వయకర్త

18లోగా దరఖాస్తులు పంపాలి



రిసోర్సుపర్సన్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పంపాలి. ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయి. అక్టోబర్ 11 నాటికి రిసోర్సుపర్సన్లు విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటాం.

–శ్రీరాం పురుషోత్తం, డిఈఓ, అన్నమయ్య జిల్లా

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ బసవగారిపల్లెకు చెందిన క్రిష్ణారెడ్డి (52) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం అమ్మచెరువుకు చెందిన పి.భారతమ్మ(40) కుటుంబ సమస్యలతో మాత్రలు అధికంగా మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ దొమ్మనబావికి చెందిన వై.చలపతి (45) ఎస్ఈబీ పోలీసులు వేధిస్తున్నారని పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సమాచార శాఖలో విస్తృత సేవలు


బి.ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న అధికారులు

రాయచోటి : సమాచార శాఖలో పీఆర్‌ఓ బి.ధర్మానాయక్ విస్తృతంగా సేవలు అందించారని సమాచార పౌర సంబధాల శాఖ డీఐపీఆర్‌ఓ భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం పేర్కొన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్(గెజిటెడ్–పర్మినెంట్) యూపీపీఎస్సీ ద్వారా ఎంపికైన బి.ధర్మానాయక్ గురువారం పీఆర్‌ఓ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఐపీఆర్‌ఓ, డీపీఆర్‌ఓలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన యుపీపీఎస్సీ పరీక్షలో విజయం సాధించి, ఇంటర్వ్యూలో సమర్థతను నిరూపించుకుని ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ మృతి


వెంకటసుబ్బయ్య మృతదేహం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఇ.వెంకటసుబ్బయ్య(50) బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఈయన బెటాలియన్‌లో మోటార్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. గుండెపోటు రావడంతో తోటి ఉద్యోగులు కడప లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఈయన స్వగ్రామం బద్వేల్ మండలంలోని గుండంరాజుపల్లె గ్రామం. ఇతనికి భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఫిజియోథెరపీ వైపు.. ప్రజల చూపు

- రిమ్స్‌లో ప్రత్యేక విభాగం
- అవసరమైన వారికి విశేష సేవలు
- నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం


కడప రిమ్స్‌లో ఫిజియోథెరపీ విభాగంలో చికిత్సలు అందిస్తున్న ఫిజియోథెరపిస్ట్‌లు


వైద్య సేవలు, సూచనలు అందిస్తున్న రిమ్స్ ఫిజియోథెరపీ హెచ్‌ఓడీ డాక్టర్ సంపత్‌కుమార్

కడప అర్బన్ : మానవ శరీరంలో నరాల పటుత్వం, కదలికలు తగ్గిపోయినా, కండరాల శక్తి, కీళ్ల విభాగాల నొప్పులు, సొంతంగా శారీరక పనులు చేసుకోలేని వారికి ఫిజియోథెరపీ ట్రీట్‌మెంట్ ఎంతో అవసరం. ఫిజియోథెరపీ ద్వారా వైద్యం అందిస్తే వారికి శారీరక సంవృద్ధి, శక్తి పొంది వారి జీవన శైలి సజావుగా సాగేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుత రోజుల్లో ఫిజియోథెరపీ ద్వారా ఇస్తున్న వైద్యం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. దీంతో ఈ విభాగంలో చికిత్స పొందాల్సిన వారంతా శ్రద్ధగా ముందుకు వస్తున్నారు. ప్రపంచంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను 1951లో కనుగొన్నారు. సెప్టెంబర్ 8ని 1996లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా ఎంచుకున్నారు. అప్పటి నుంచి ఏటా సెప్టెంబర్ 8న నిర్వహిస్తున్నారు.

- ఫిజియోథెరపీ (పి.టి) అనేది ఆరోగ్య సంరక్షణ వృత్తి. ఇది మసాజ్‌లు, హీట్ థెరపీ, వ్యాయామాలు, ఎలక్ట్రోథెరపీ, రోగి విద్య, గాయం, అనారోగ్యం లేదా వైకల్యానికి చికిత్స చేయడానికి సలహా వంటి వివిధ చికిత్సా విధానాలను కలిగి వుంటుంది. ఎవరైనా గాయం, అనారోగ్యం లేదా వైకల్యంతో ప్రభావితమైనపుడు కదలిక, పనితీరును పునరుద్ధరించుకోవడానికి సహాయపడుతుంది.
- కడప రిమ్స్‌లో వైద్యకళాశాల ప్రారంభం నుంచే ఆర్థోపెడిక్ విభాగానికి అనుబంధంగా ఫిజియోథెరపీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ప్రతి రోజూ ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చిన వారిలో 120- 150 వరకు వైద్య సేవలు పొంది ఉపశమనం పొందుతున్నారు. 30 మంది ఇన్‌ట్రైనీలు ఇన్‌పేషెంట్ విభాగంలో వివిధ వార్డులకు హాజరై అవసరమైన వారికి వైద్య సేవలు, వ్యాయామ సూచనలు అందిస్తున్నారు. రోగి, వారి కుటుంబ సభ్యులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. శస్త్ర చికిత్స లేదా ఏదైనా రకమైన పక్షవాతం తర్వాత రోగుల పునరావాసంలో వారి పాత్రను వారే అర్థం చేసుకోవాలి.
- ఆస్టియో అర్థరైటిస్, మృదు కణజాల గాయాలు (ఘనీభవించిన భుజం, టెన్నిస్, ఎల్బో, అరికాలి అసౌకర్యాలు మొదలైనవి), రాడిక్యులోపతి, పోస్ట్ ట్రామాటిక్ గాయాలు, పునరావాసం, శస్త్రచికిత్స అనంతర పరిస్థితులు వంటి వివిధ అనారోగ్య పరిస్థితులతో బాధపడుతున్న రోగులు, రిమ్స్ ఫిజియోథెరపీ బృందం ద్వారా చికిత్స పొందుతున్నారు.
- కడప రిమ్స్‌లోని ఫిజియోథెరపీ విభాగంలో ఐ.ఎఫ్.టి, ఎస్.డబ్ల్యూ.డి, అల్ట్రాసౌండ్, ఎలక్ట్రికల్ స్టిమ్యులేటర్, ట్రాక్షన్, మైనపు చికిత్స ఇతరత్రా అన్ని రకాల ఎలక్ట్రోథెరపీ పరికరాలు చికిత్స చేయడానికి వున్నాయి.
- ఈ విభాగంలో వృద్ధాప్య, పీడియాట్రిక్స్ కేర్‌కు సంబంధించిన ప్రత్యేక శాఖలను కలిగి వుంది. ఈ శాఖలు ఫిజియోథెరపీ చికిత్స అవసరమయ్యే వృద్ధాప్య వయసు, పిల్లల వయసు వారికి ప్రత్యేక సంరక్షణను అందిస్తుంటారు.
- రిమ్స్‌లో 2021 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఫిజియోథెరపీ విభాగానికి వచ్చి వైద్య సేవలు పొందిన కొత్త, పాత రోగులు 16370 మంది వుంటారు. అలాగే 2022 జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు 23421 మంది ట్రీట్‌మెంట్ పొందారు. 2023 జనవరి నుంచి ఆగస్టు 31 వరకు 18720 మంది ట్రీట్‌మెంట్‌ను పొందారు.

రోగులకు ఉపశమనం కలిగించడమే ధ్యేయం

కడప రిమ్స్‌లో ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చిన రోగుల్లో ప్రత్యేకంగా ఫిజియోథెరపీ అవసరమైన వృద్ధులకు, పిల్లలకు, మహిళలకు వైద్య సేవలను తమ పరిధిలో నిర్వహించి ఉపశమనం కలిగించడమే ధ్యేయం. కొన్నేళ్లుగా ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించి తమకు ఆ విభాగంలో అవసరమైన సమయంలో ట్రీట్‌మెంట్‌ను తీసుకునేందుకు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ విభాగం ప్రాముఖ్యతను గుర్తించి తమవంతుగా సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా శుక్రవారం (8వ తేదీ)న కడప రిమ్స్‌లో రక్తదానం శిబిరం, ఇతర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.
– డాక్టర్ సంపత్‌కుమార్, హెచ్‌ఓడీ, ఫిజియోథెరపీ విభాగం, జీజీహెచ్(రిమ్స్), కడప

ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు

– ముందస్తుగా తెలిపిన ప్రధాని, రాష్ట్రపతి


పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

రాజంపేట : ఈ నెల 11న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి దేశ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములు వేర్వేరుగా ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి ఆశీస్సులు నిండుగా ఉండాలని, ఆయురారోగ్యాలతో కలకలం సంతోషంగా జీవించాలని ఆశీర్వదించారు.

అక్రమ మద్యం కేసులో ముగ్గురి అరెస్ట్

కురబలకోట : కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతోపాటు డ్రైవర్‌ను గురువారం అరెస్ట్ చేశారు. మదనపల్లె ఎస్ఈబీ సీఐ శ్రీహరి రెడ్డి కథనం మేరకు.. కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన అరవదాసరి సందీప్‌కుమార్ (27), అదే మండలం ఎర్రబల్లె గ్రామ పరిధిలో పని చేస్తున్న లేపాక్షి అమ్మాజీ (33) కొంత కాలంగా అంగళ్లు కేంద్రంగా అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నారు. మదనపల్లె ఎక్సైజ్ పోలీసులకు సమాచారం రావడంతో నిఘా ఉంచారు. గురువారం కర్ణాటక నుంచి వారు ఆటోలో స్వగ్రామం అంగళ్లులోని అమ్మాజీ కొత్త ఇంటిలోకి మద్యం తరలిస్తుండగా వెంబడించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన డీకె డబుల్ కిక్ విస్కీ రకానికి చెందిన 180 ఎంఎల్ వి 480 టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు. రాయల్పాడుకు చెందిన ఆటో డ్రైవర్ నడిపిరెడ్డి (35)తోపాటు సందీప్‌కుమార్, అమ్మాజీని అరెస్టు చేశారు. అనంతరం రిమాండుకు తరలించినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన మొహమ్మద్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరం చెక్‌పోస్టు సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాదాడు. స్థానికుల వివరాల మేరకు... మండల పరిధిలోని రాచపల్లి గ్రామానికి చెందిన పగడాల మొహమ్మద్(23) కువైట్ వెళ్లడానికి మెడికల్ చెకప్‌లు చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అందులో భాగంగా బైకులో కడపకు వెళ్లి అక్కడి నుంచి ఓ ప్రైవేట్ వాహనంలో బెంగుళూరు వేళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం కడపకు వెళ్తుండగా మండల పరిధిలోని కొత్తమాధవరం చెక్‌పోస్టు వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మొహమ్మద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మొహమ్మద్ తల్లిదండ్రుల పేర్లు ఓబులేసు, నాగమునెమ్మ. వీరికి ఏడుగురు సంతానం. అందులో ముందుగా ఇద్దరు వేరు వేరు ప్రమాదాల్లో చనిపోగా ఇప్పుడు మొహమ్మద్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. బతుకు దెరువు కోసం కువైట్‌కి వెళ్లేందుకు మెడికల్ కోసం వెళ్తున్న కొడుకు మార్గంమధ్యలో మరణించాడనే వార్త విన్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. రాచపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

భూ వివాదంలో ముగ్గురిపై దాడి


గాయపడిన దుగ్గి కుటుంబం రాజంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

రాజంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేటకు చెందిన సినీఫొటోగ్రఫీ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ దుగ్గి చంద్రకళ, వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటు కార్యదర్శి దుగ్గి గంగాధర్, ఆయన తల్లి రెడ్డమ్మపై భూ వివాదంలో రఘురామరాజు, ఆయన తనయుడు, మరో పది మంది, కులం పేరుతో దూషిస్తూ, మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సంఘటన ఎస్ఆర్‌పాలెం సమీపంలోని పొలం (పుల్లంపేట రెవెన్యూ పరిధి) వద్ద చోటుచేసుకుంది. గాయపడిన వారిని రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి దుగ్గి గంగాధర్ మాట్లాడుతూ తమకు ఎస్ఆర్‌పాళెం సమీపంలో ఒకటిన్నర ఎకరా భూమి ఉందన్నారు. 40 ఏళ్ల నుంచి తమ అనుభవంలో ఉందన్నారు. ఈ భూమి తమది కాదంటూ ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించి, స్థానిక రెవెన్యూ సహకారంతో తమ భూమి స్వాధీనం కోసం ముందస్తు వ్యూహం ప్రకారం పొలం వద్దకు వచ్చారన్నారు. ట్రాక్టర్‌తో ముళ్లకంచెను తీసుకొచ్చారన్నారు. తనకు తెలిసి, తన భార్య, అమ్మను పంపించానన్నారు. అక్కడికి పోతానో.. గొడవకు దిగి, దౌర్జన్యంకు పాల్పడ్డారన్నారు. రాళ్లతో దాడి చేశారన్నారు. విషయం తాను వెళితే కులంపేరుతో దూషించి, తనపై దాడికి దిగారన్నారు. స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చామన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు పుల్లంపేట పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇస్తామని చెప్పి వెళ్లిపోయారన్నారు. వీరిని మాలమహానాడు నేత లింగం సంజీవ్‌తోపాటు పలువురు దళిత నేతలు పరామర్శించారు.

రైల్వే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వేస్టేషన్ పరిధిలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అలా జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ ఆదేశించారు. కడప నగరంలో రెండు రోజుల క్రితం గూడ్స్ రైలు పట్టాలు తప్పిన నేపథ్యంలో ఆయన గుంతకల్లు అధికారుల బృందంతో కలిసి గురువారం ఇక్కడికి వచ్చారు. కడప రైల్వేస్టేషన్‌తోపాటు అధికారుల బృందం భాకరాపేట వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. అలాగే నంద్యాల డెమూ ప్రమాదం జరిగిన తీరును సంఘటనా స్థలానికి వెళ్లి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రైల్వేస్టేషన్‌లో పదే పదే ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా సిగ్నలింగ్, ఇంజినీరింగ్, ట్రాఫిక్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రమాదం జరిగిన రెండు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు కడప రైల్వేస్టేషన్ లోనే విచారణ చేపట్టారు.

గాయపడిన పీహెచ్‌సీ వాచ్‌మ్యాన్ మృతి



మృతి చెందిన పేరం తిరుపాల్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మల్లేశ్వరపురం ఎదురుగా ఉన్న మాధవరం పీహెచ్‌సీ వద్ద ఉన్న జాతీయ రహదారిపై ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పేరం తీరుపాల్ (57) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు.. గత 20 సంవత్సరాల నుంచి మల్లేశ్వరపురం ఎదురుగా ఉన్న మాధవరం పీహెచ్‌సీలో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్న పేరం తిరుపాల్ ఈ నెల 3వ తేదీన పీహెచ్‌సీలో విధులకు హాజరయ్యేందుకు మల్లేశ్వరపురం నుంచి నడుచుకుంటూ వస్తున్నాడు. కడప–చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా రాజంపేట నుంచి కడప వైపు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రంగా గాయం అయ్యింది. గమనించిన స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా గురువారం ఉదయం తిరుపాల్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంపై తిరుపాల్ కోడలు పేరం మౌనిక ఈ నెల 5న స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నేడు జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని ఎస్ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫాం, బీఫాం, పీజీ, డిగ్రీ, ఇంటర్, టెన్త్ విద్యార్హతగల నిరుద్యోగ యువత పాల్గొనవచ్చునని వారు పేర్కొన్నారు. 73 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా ఆరోగ్యమాత ఊరేగింపు



ఊరేగింపులో విశ్వాసులు (ఇన్‌సెట్) తేరుపై ఆరోగ్య మాత

కడప కల్చరల్ : మరియతల్లి జయంతి కోసం ఎంతో ఉత్సాహభరితంగా ఎదురుచూసిన విశ్వాసులకు గురువారం కన్నుల పండుగ. ఎంతో వైభవంగా మరియ తల్లి, జిల్లా ప్రజలకు దర్శనాన్ని, వరాలను అనుగ్రహించిందని, భక్తి విశ్వాసాలతో మరియ తల్లిని దర్శించుకున్న వారికి పాప ప్రక్షాళన చేకూరుతుందని ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ ఎండి ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మరియాపురంలోని సెయింట్ మేరీస్, క్రైథిడల్ చర్చి నందు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా క్రైథిడల్ విచారణ గురువులు తాళ్ల లాజర్ ప్రత్యేక దివ్యబలి పూజను సమర్పించారు. అనంతరం పురవీధుల గుండా మరియతల్లిని తేరుపై, ఎండి ప్రసాద్ రావు, విల్సన్, తిరుణాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వరుస క్రమంలో క్రమశిక్షణగా భక్తి గీతాలను ఆలపిస్తూ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆరాధన, స్తుతి ప్రార్థనలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మరియ తల్లి జయంతి సందర్భంగా ఉదయం 8 గంటలకు కడప అపోస్తులిక పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. తర్వాత కానుకల సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పతాక అవరోహణతో ఆరోగ్యమాత మహోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో మునిడోరియన్, డాన్ బోస్కో మరియాపురంలోని వివిధ సంస్థల గురువులు ఆరోగ్యమాత, క్రైథిడల్ మదర్లు, తిరుణాల కమిటీ సభ్యులు డాన్ బోస్కో విద్యార్థులు, వింసెంట్, క్రైస్తవ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..




మృతి చెందిన చిన్నారి హిమన్య తీవ్రంగా గాయపడిన విష్ణు, స్వర్ణ

ఓర్వకల్లు/పులివెందుల రూరల్ : దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న మినీ లారీని కారు ఢీకొనడంతో.. ఓ చిన్నారి దుర్మరణం చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన నారాయణ స్వామి, విజయమ్మలు తమ కుమారుడైన కడపలో నివాసముంటున్న విష్ణు, స్వర్ణ కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని షిర్డీకి వెళ్లారు. పిల్లాపాపలతో కలిసి భక్తిశ్రద్ధలతో దేవున్ని దర్శించుకున్నారు.

అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఔరంగబాద్ ఎయిర్ పోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు విమానంలో వచ్చారు. అక్కడి నుంచి కారులో స్వస్థలానికి బయలుదేరారు. మార్గంమధ్యలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెలోని ఓంశాంతి ఆశ్రమం వద్దకు రాగానే.. ఆగివున్న డీసీఎం వాహనాన్ని ఢీకొంది. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో చిన్నారి హిమన్య (16 నెలలు) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. నారాయణస్వామి, విజయ, విష్ణువర్దన్, స్వర్ణలత, లౌక్య తీవ్రంగా గాయపడ్డారు. విష్ణువర్దన్, స్వర్ణలతల కుమార్తెలు లౌక్య, హిమన్య. కారులో ఇరుక్కున్న నారాయణస్వామిని స్థానికుల సాయంతో పోలీసులు అతికష్టం మీద బయటకు తీశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో మరో ఐదుగురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐలు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాల వద్ద జరిగిన ఆటో డ్రైవర్ సుధాకర్ హత్య కేసులో మరో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రధాన నిందితుడు పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన తైదుల కిషోర్‌ను బుధవారం అరెస్ట్ చేసిన విషయం విదితమే. కిషోర్‌ను విచారణ చేపట్టి రాబట్టిన సమాచారంతో.. హత్యలో పాల్గొన్న మిగిలిన నిందితుల కోసం తిరుపతిలో గురువారం విస్తృతంగా గాలింపు చేపట్టారు. తిరుపతికి చెందిన కాకి ఉమాప్రసాద్ (20), పాలుసు మని అలియాస్ మణికంఠ (29), కె. సతీష్ అలియాస్ సత్తి (23), చిత్తూరు జిల్లా విజయపురం మండలం చెంగామనాయుడుకండ్రిగకు చెందిన మొద్దు జీవ అలియాస్ చందు (22), నెల్లూరు టౌన్ జగజ్జీవ నగర్‌కు చెందిన పల్లిపట్టు సునీల్‌కుమార్ (23)ను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రెండు సూదులు, హత్య చేయాలని తమ వెంట ఉంచుకున్న కత్తితోపాటు రెండు సెల్‌ఫోన్లు, బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పీలేరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హాజరు పరిచారు.

మరికొంత మంది కోసం గాలింపు

సుధాకర్ హత్యకు ఉపయోగించిన పాదరసం, సైనైడ్ సరఫరా చేసిన మరికొంత మంది కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన ఐదుగురు నిందితులపై గతంలోనూ వివిధ కేసులు నమోదు అయినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు నరసింహుడు, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.